అన్నదాతకు 'గండి'కోత

- వెదిరలో కరకట్టకు గండి
- రెండేళ్లుగా ఇదే పరిస్థితి
- ఆందోళనలో రైతులు


గండి పడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ భాస్కర్(ఫైల్)

రామడుగు: భారీ వర్షాలతో కరకట్టకు గండి పడడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంట పొలాల మధ్య నుంచి భారీగా గండి పడడంతో పంట సాగు చేసుకోలేని దుస్థితి నెలకొంది. వెదిర గ్రామంలో ఈ గండి ఫలితంగా దాదాపు వంద ఎకరాల మేర రైతులు పంట సాగు చేసుకోలేని పరిస్థితి ఉంది.

రెండేళ్లుగా..

వెదిర గ్రామ పరిధిలో ఉన్న నావులకుంట చెరువు నుంచి మత్తడి నీరు కొత్తకుంట చెరువులోకి కాలువ ద్వారా వెళ్తోంది. ఈ కాలువ కరకట్ట పటిష్టంగా లేక రెండేళ్లుగా గండి పడుతోంది. భారీగా వర్షాలు కురవడంతో మత్తడి నీరు అధికంగా వచ్చి కరకట్ట మధ్యలో గండి పడింది. రైతుల పంట పొలాల మధ్య నుంచి భారీగా గండి పడడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది.

మూడు మీటర్ల మేర..

పంట పొలాల్లో దాదాపు రెండు, మూడు మీటర్ల మేర గండి పడడంతోపాటు పది నుంచి ఇరవై మీటర్ల వెడల్పుతో మట్టి కొట్టుకుపోయిందని, పంట సాగు చేసుకోవడానికి వీల్లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండుసార్లు పూడ్చినా..

కరకట్ట కాలువకు గండి పడడంతో పంట పొలాలను సాగు చేసుకోవడానికి రైతులు సొంతంగా డబ్బులు ఖర్చు చేసి గండిని రెండుసార్లు పూడ్చారు. మళ్లీ ఇలాంటి పరిస్థితి రావడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడిందని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తక్షణం తమ పరిస్థితి అర్థం చేసుకొని కరకట్టకు గండి పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

సాగుకు నోచుకోని పంటపొలాలు

కాలువ కట్టకు గండి పడి దాదాపు 70 నుంచి వంద ఎకరాల పంటపొలాలు సాగుకు నోచుకోని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోయారు. తమ పొలాలు బీడు భూములుగా మారిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు.

రెండెకరాల్లో గండి



కాలువ కట్టకు గండి పడి రెండుసార్లు రెండెకరాల్లో భారీగా గండి పడి మట్టి కొట్టుకుపోయింది. మొదటిసారి సొంత ఖర్చులతో బాగు చేసుకున్న. మళ్లీ ఈసారి కురిసిన భారీ వర్షాలతో కట్టకు గండి పడి భారీగా పెద్ద కయ్యలు పడ్డయ్. ఏం చెయ్యాల్లో తెలియని పరిస్థితి ఉంది. ప్రభుత్వం కాలువ కట్టకు మరమ్మతు చేసి పొలాలను కాపాడాలె.

– వంగళ శ్రీనివాస్‌రెడ్డి, రైతు, వెదిర

రెండెకరాలు బీడుగానే..



భారీ వర్షాలతో వరద నీరు రావడంతో మూడు సంవత్సరాల నుంచి రెండెకరాల పంట పొలం బీడుగా ఉంచుకోవాల్సిన పరిస్థితి. పొలం మధ్యలో గండి పడడంతో సాగు చేయలె. అధికారులు తమ సమస్యను పరిష్కరించి పొలం సాగు చేసుకునేలా చూడాలె.

– వంచ శ్రీధర్‌రెడ్డి, బాధిత రైతు, వెదిర

ప్రభుత్వం దృష్టికి..

కాలువ కట్టకు గండి పడడంతో పంట పొలాల్లో పెద్దపెద్ద కయ్యలు పడి మట్టి కొట్టుకుపోయింది. దీన్ని పరిశీలించాం. పరిస్థితి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా.

– భాస్కర్, తహసీల్దార్(గ్రామ ప్రత్యేకాధికారి), రామడుగు

కొత్తగట్టులో మత్స్య జయంతి


ఉత్సవమూర్తులకు పూల అలంకరణ

శంకరపట్నం: కొత్తగట్టు మత్స్య గిరీంద్రస్వామి ఆలయంలో శనివారం మత్స్య జయంతి వేడుకలను ఆలయ అర్చకులు నిర్వహించారు. గర్భగుడిలో ఉత్సవమూర్తులకు ఆలయ అర్చకులు శేషం మురళీధరాచార్యులు, మాధవాచార్యులు పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పూజలు చేసి ఆశీర్వచనాలు తీసుకున్నారు.

ఆలయాల నిర్మాణానికి చేయూత

సైదాపూర్: వెన్నంపల్లి, అమ్మనగుర్తి, గుండ్లపల్లి గ్రామాల్లో నిర్మిస్తున్న దేవాలయాలకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.లక్ష ఆర్థిక సాయం చేసినట్లు అమ్మనగుర్తి ఎంపీటీసీ లంకదాసరి అరుణ, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లయ్య, నాయకుడు కొండాల్‌రెడ్డి శనివారం తెలిపారు. వెన్నంపల్లిలో ఆంజనేయస్వామి దేవాలయానికి రూ.50,016, అమ్మనగుర్తి, గుండ్లపల్లి గ్రామాల్లో గౌడ కులస్తులు నిర్మిస్తున్న ఎల్లమ్మ దేవాలయానికి రూ.50,016 నగదు అందజేసినట్లు ఆయా గ్రామాల ఆలయాల నిర్మాణ కమిటీ సభ్యులు చెప్పారు.

భగవద్గీత ప్రవచనం


ప్రవచిస్తున్న శ్రీపరిపూర్ణానందస్వామి

జమ్మికుంట: పట్టణంలోని భగవద్గీత జ్ఞాన మందిరంలో చిత్తూరు జిల్లా ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ పరిపూర్ణానందస్వామి శనివారం రాత్రి భక్తులకు భగవద్గీత ప్రవచనం చేశారు. భగవద్గీతలోని సూక్తులు, జీవనంలో పాటించాల్సిన పద్ధతులపై వివరించారు. పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా గుట్ట జాతర వేడుకలు


ముస్తాబైన శ్రీవేంకటేశ్వరస్వామి

చొప్పదండి: గుమ్లాపూర్ గ్రామ శివారులో శ్రీవేంకటేశ్వరస్వామి గుట్ట జాతర శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. గుట్టపైన వెలిసిన శ్రీవేంకటేశ్వరస్వామికి, గుట్ట మధ్యలో ఉన్న శ్రీలక్ష్మీ సమేత నరసింహస్వామికి గ్రామస్తులు ఉదయం నుంచి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం గుట్ట ఆవరణలో వేడుకలను జరిపారు. ఎడ్ల బండ్ల ప్రదర్శన మహోత్సవం, స్వామివారి ఊరేగింపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్నేహభావంతో మెలగాలి


పారువెల్లలో విద్యార్థుల నాటక ప్రదర్శన

గన్నేరువరం: విద్యతో విలువ పెరుగుతుందని, దానిని పంచుతూ స్నేహభావంతో మెలగాలని ప్రధానోపాధ్యాయుడు పెద్ది బీరయ్య అన్నారు. పారువెల్ల గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి అధ్యక్షతన విద్యార్థులకు వీడ్కోలు, పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సహకార సంఘం డైరెక్టర్ బద్దం రాంరెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ యాళ్ల తార, పీసు శిరీష, రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు చీటి శ్రీలత, చెరుకు ప్రభావతి, గడ్డం శ్రీలత, యాళ్ల ప్రేమలత, గడ్డం శ్రీనివాస్, మహమ్మద్ ఇఫ్తాకర్ అలీ, నగునూరి చొక్కయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత


నిత్యావసర సరుకులు అందజేస్తున్న నాయకులు

రామడుగు: రామడుగులో చిట్యాల పద్మ, బత్తిని విజయ, గుర్రం లక్ష్మీరాజం ఇటీవల మృతిచెందగా.. వారి కుటుంబాలను శనివారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యంతోపాటు నిత్యావసర సరుకులను అందజేశారు. రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యాంసుందర్‌రెడ్డి, మామిడి దిలీప్‌కుమార్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, అనుపురం పర్శారాంగౌడ్, మనోజ్, శ్రీనివాస్, విజయ్, నరేష్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీపీకి సన్మానం

రామడుగు: రామడుగు ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన వైస్ ఎంపీపీ పూరెల్ల రాజగోపాల్‌గౌడ్‌ను శనివారం రామడుగులో పలువురు నాయకులు సన్మానించారు. భీరెడ్డి కరుణాకర్‌రెడ్డి, పంజాల శ్రీనివాస్, గాజుల శ్రీనివాస్, నీలం లక్ష్మీరాజం, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు


కండువా వేస్తున్న బండి సంజయ్

శంకరపట్నం: బీఆర్‌ఎస్ మెట్‌పల్లి ఎంపీటీసీ భర్త కొయ్యడ కుమార్‌యాదవ్‌తోపాటు పార్టీ నాయకులు శనివారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ సమక్షంలో బీజేపీలో చేరారు. వీరికి బండి సంజయ్ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు అనిల్, సమ్మిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాములు, కొంరయ్య తదితరులున్నారు.

గొర్రెల పంపిణీకి కట్టిన డీడీలు వాపస్

సైదాపూర్: గత ప్రభుత్వం గొల్లకురుమలకు గొర్రెల పంపిణీకి రెండో విడత కింద లబ్ధిదారుల నుంచి వాటాధనం కింద కట్టించుకున్న డీడీల డబ్బులు వాపస్ చేయడానికి లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నట్లు పశు వైద్యాధికారి సీహెచ్ విజేందర్‌రావు శనివారం తెలిపారు. గొర్రెల పంపిణీ పథకంలో ఒక యూనిట్ విలువ రూ.1.75లక్షలు కాగా.. అందులో రూ.43,750 లబ్ధిదారుడి నుంచి వాటాధనం కింద డీడీలు కట్టించుకున్నారు. గొర్రెల పంపిణీ జరగలేదు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం ఆ పథకాన్ని కొనసాగిస్తదో, లేదో తెలియని పరిస్థితిలో లబ్ధిదారులున్నారు. కొందరు మా డీడీ డబ్బులు మాకివ్వాలని కోరడంతో కలెక్టర్ ఆదేశం మేరకు డీడీల వాపస్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు విజేందర్‌రావు తెలిపారు. దరఖాస్తులను సంబంధిత పశు వైద్యశాలలో సమర్పించాలని కోరారు.

నియామకం

కరీంనగర్‌కల్చరల్: జర్నలిస్ట్ యూనియన్ ఆఫ్ స్టేట్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా రావుల సత్యనారాయణను నియమిస్తున్నట్లు రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి , జగిత్యాల, సిరిసిల్లా జిల్లాలకు త్వరలో మహాసభలు నిర్వహించి పూర్తిస్థాయి కమిటీలు వేస్తామని పేర్కొన్నారు.

సీతారాముల కల్యాణానికి ఆహ్వానం

కరీంనగర్‌కల్చరల్: భగత్‌నగర్ అంజనాద్రి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 17న జరిగే సీతారామ కల్యాణానికి హాజరు కావాల్సిందిగా మేయర్ సునీల్‌రావుకు ఆలయ కమిటీ సభ్యుడు శనివారం ఆహ్వానం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ క్యాంపు కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరించారు. ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి


వినోద్‌కుమార్ వియ్యంకుడు తిరుమలరావుతో విద్యాసంస్థల కరస్పాండెంట్లు

హుజూరాబాద్: బీఆర్‌ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బోయినపల్లి వినోద్‌కుమార్ బంధువులు శనివారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. వినోద్‌కుమార్ వియ్యంకుడు డాక్టర్ ఎర్రబెల్లి తిరుమలరావు సమక్షంలో పాఠశాలలు, కళాశాలల కరస్పాండెంట్లతో సమావేశం జరిగింది. తెలంగాణ సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి వినోద్‌కుమార్ అని, గతంలో ఆయన ఎంపీగా ఉన్న సమయంలో తెలంగాణ సమస్యలపై పార్లమెంటులో ప్రభుత్వాన్ని నిలదీశారన్నారు. వివిధ విద్యాసంస్థల కరస్పాండెంట్లు ముచ్చ నారాయణరెడ్డి, కోరం సంజీవరెడ్డి, సుంకిశాల సంతోష్‌రావు, బి.రాజ్‌కుమార్, పి.కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, పి.విజయపాల్‌రెడ్డి, ఎం.ప్రసాద్, రవీందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న రామచంద్రం మాదిగ

హుజూరాబాద్: ఈనెల 14న సిరిసిల్లకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ రానున్నట్లు ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు రుద్రారపు రామచంద్రం మాదిగ అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, యువసేన నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మారేపల్లి శ్రీనివాస్, మహాజన సోషలిస్ట్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవనూరి రవీందర్, మండల అధ్యక్షుడు బొరగాల రాజ్‌కుమార్, నాయకులు కలవల మల్లయ్య, డాక్టర్ తడికమళ్ళ శేఖర్, మోరే సతీష్, రుద్రారపు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేసిన ట్రస్ట్ సభ్యులు

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని శ్రీరామసాయి మానవ సేవ చారిటబుల్ ట్రస్ట్(వృద్ధాశ్రమం) నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులుగా కె.గణపతిరెడ్డి, ఆర్.బాబయ్య, కె.మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బచ్చు శివకుమార్, కోశాధికారిగా మురికి మహేందర్, జాయింట్ సెక్రటరీలుగా మధుసూదన్, సుధాకర్, దేవదాస్, గౌరవ సభ్యులుగా రవీందర్, శ్రీనివాస్, తిరుపతి, సురేష్, నాగయ్య, కిషోర్ ప్రమాణ స్వీకారం చేశారు. అయిత జనార్దన్, జడల రామలింగం, డా.రాము, బచ్చు వీరలింగం, రాయమొగిలి పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను తరలించాలి

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ ఆటోనగర్‌లో ఉన్న డంపింగ్ యార్డును మరింత దూరంగా తరలించాలని సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి మామిడాల మనోహర్ డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికంగా చెత్తను డంప్ చేయడం, నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగుతున్నాయని అన్నారు. చెత్త నుంచి వెలువడే పొగతో ఆ ప్రాంత ప్రజలు శ్వాస, ఆరోగ్య పరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించి ప్రజల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో సౌత్ ఇండియా చైర్మన్ జి.హన్మగౌడ్, రాష్ట్ర చైర్మన్ నోముల సంపత్‌గౌడ్, రాష్ట్ర మహిళా విభాగం చైర్‌పర్సన్ రాజేశ్వరి, కరీంనగర్ వైస్ చైర్మన్ వెంకట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో వసతులు కల్పించాలి

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో వసతులు కల్పించాలని రైతు సేవా సమితి సభ్యులు కోరారు. శనివారం కేంద్రం సందర్శనకు వచ్చిన కలెక్టర్ పమేలా సత్పతికి విజ్ఞప్తి చేశారు. వర్షానికి ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, తాగునీటి వసతి, విశ్రాంతి కోసం తాత్కాలిక షెడ్లు, రైతు విశ్రాంతి భవనం ఏర్పాటు చేయాలన్నారు. గతేడాది ఎస్సారెస్పీ నీరు రావడం వల్ల పంటలు పండగా, ప్రస్తుతం 150 ఎకరాల్లో పంట ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామరైతు సేవా సమితి అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పండుగ లక్ష్మీపతి, గౌరవ అధ్యక్షుడు కాంతాల జగన్‌రెడ్డి, సభ్యులు పల్లె జితేందర్, జక్కు లచ్చయ్య, పల్లాటి శంకరయ్య, దావీదు, లక్ష్మీరాజు, మనోహర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

కరీంనగర్‌కల్చరల్: హౌసింగ్‌బోర్డుకాలనీ గాయత్రీనగర్‌లో గల బాలకుటీర్‌లో ఉంటూ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహించిన వివిధ రకాల ఇండోర్ గేమ్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్, ధనపురి సత్యమ్మ, బాలకుటీర్ ప్రెసిడెంట్ కరుణాకర్‌రావు, రాజారెడ్డి, కనకయ్య, నయన్‌పటేల్, విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు


చెల్పూర్‌లో సీఐ, కేంద్ర బలగాల కవాతు


వన్నారంలో సాయుధ బలగాల కవాతు

హుజూరాబాద్: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హుజూరాబాద్ టౌన్ సీఐ బొల్లం రమేశ్ అన్నారు. కరీంనగర్ సీపీ ఆదేశాల మేరకు శనివారం చెల్పూర్, జూపాక గ్రామాల్లో కవాతు నిర్వహించారు. రాబోయే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. 20 మంది సీఐఎస్ఎఫ్ ఆఫీసర్లు, జవాన్లు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి

రామడుగు: రాబోయే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో సహకరించాలని చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ కోరారు. వన్నారం గ్రామంలో శనివారం సాయంత్రం పోలీస్ కవాతు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులున్నా.. తక్షణం సమాచారమందించాలని సూచించారు. రామడుగు ఎస్సై సురేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్లపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న గోస్కుల అజయ్

హుజూరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన గంజాయి స్మగ్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నగర కార్యదర్శి గోస్కుల అజయ్ కోరారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గంజాయి మత్తులో యువత బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయి సరఫరాపై పోలీస్ నిఘా పెట్టి ఉక్కుపాదం మోపాలని అన్నారు. బానిసయిన యువతను గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. నాయకులు రేణుప్రసాద్, లక్ష్మణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఒక్కరోజుకే బీఆర్‌ఎస్‌లోకి..


బీఆర్‌ఎస్ కండువా వేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్: బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన మాజీ కౌన్సిలర్, మాజీ ఎంపీటీసీ కొయ్యడ కమలాకర్, శ్రీదేవి శనివారం తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కమలాకర్, శ్రీదేవి మాట్లాడుతూ.. కొందరి ప్రోద్బలంతో కాంగ్రెస్ పార్టీలో చేరామని, మా రాజకీయ జీవితం బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికార కాంగ్రెస్‌లో ఇతర పార్టీల నేతలను చేర్చుకొని బలోపేతం చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌బాబు చూస్తుండగా.. గులాబీ పార్టీ నేతలు పార్టీ వీడకుండా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చూస్తున్న వైనం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌లో చేరిన ఒక్కరోజులోనే కొయ్యడ కమలాకర్, శ్రీదేవి తిరిగి గులాబీ కండువా కప్పుకోవడంపై సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ జరుగుతోంది. కాగా పార్లమెంట్ ఎన్నికలు ముగిసేలోగా రాజకీయ వలసలు ఎలా ఉంటాయే వేచి చూడాలి.

రేషన్ బియ్యం అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న అశోక్

జమ్మికుంట: పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయని, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జమ్మికుంట జోన్ కార్యదర్శి శీలం అశోక్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పౌర సరఫరా శాఖ అధికారులు నామమాత్రపు తనిఖీలు చేస్తున్నారని, ప్రతి రేషన్ దుకాణం తనిఖీ చేస్తే పెద్దఎత్తున అక్రమాలు బయటపడతాయన్నారు. షాపు నిర్వాహకులు రేషన్ కార్డుదారుల నుంచి బియ్యం సేకరించి నేరుగా మిల్లర్లకు అమ్ముతున్నారని ఆరోపించారు. మిల్లర్లు అక్రమ వ్యాపారాలకు తెర లేపుతున్నారని వాపోయారు. అక్రమార్కులపై పీడీ యాక్ట్ పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

'చీకటి పువ్వు' నాటికకు ఉత్తమ ద్వితీయ బహుమతి

కరీంనగర్‌కల్చరల్: చైతన్య కళాభారతి కళాకారులు రాజమండ్రిలోని రావులపాలెంలో ఈనెల 9 నుంచి 11 వరకు జరిగిన జాతీయస్థాయి నాటిక పోటీల్లో ప్రదర్శించిన 'చీకటి పువ్వు' నాటికకు ఉత్తమ ద్వితీయ బహుమతి, ఉత్తమ నటిగా లహరి బహుమతి పొందారని సంస్థ అధ్యక్షుడు తిప్పర్తి ప్రభాకర్ తెలిపారు. బహుమతిని సినీ నటుడు తనికెళ్ల భరణి, సినీ దర్శకుడు వంశీ చేతుల మీదుగా కళాకారులు శనివారం అందుకున్నారు. నాటికలో సత్యనారాయణ, గిరిబాబు, శ్రీనివాస్ నటించగా.. సంగీతం నాగరాజు, ఆహార్యం, లైటింగ్ నాగు చేశారని దర్శకుడు రమేశ్ తెలిపారు. కళాకారులకు పలు కళాసంస్థల బాధ్యులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, కళాకారులు అభినందనలు తెలిపారు.

హమాలీ ధరల పెంపు

కరీంనగర్‌రూరల్: యాసంగి సీజన్ హమాలీ రేట్లను పెంచడంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. ఏటా హమాలీ రేట్లను పెంచుకుంటూ పోతున్నారు. శనివారం దుర్శేడ్ సింగిల్‌విండో పరిధిలోని ఆరు కొనుగోలు కేంద్రాల్లో హమాలీ రేట్లను నిర్ణయించేందుకు సంఘం కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన హమాలీ నాయకులతో సమావేశం నిర్వహించారు. గతంలో క్వింటాల్‌కు రూ.45 ఉండగా ప్రస్తుతం రూ.48 రైతులు చెల్లించాలని సమావేశంలో నిర్ణయించారు. అదే విధంగా హమాలీ ధరలు మిగితా గ్రామాల్లో వేర్వేరుగా ఉన్నాయి. ఒక్కో గ్రామంలో రూ.40 నుంచి రూ.45 వరకు చెల్లిస్తున్నారు. అయితే హమాలీ ధరలను పెంచడంతో రైతులపై అదనంగా భారం పడుతుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కాకముందు హమాలీ చార్జీల్లో కొంత రైతు చెల్లిస్తే మిగితా ప్రభుత్వం భరించేది. గతంలో క్వింటాల్‌కు రూ.28 ఉంటే రైతులు రూ.23 చెల్లించగా రూ.5 ప్రభుత్వం చెల్లించింది. అయితే పదేళ్ల నుంచి ప్రభుత్వం హమాలీ చార్జీలను చెల్లించకపోవడంతో రైతులే పూర్తి చార్జీలను భరిస్తున్నారు. ప్రతీ సీజన్‌లో హమాలీ చార్జీలను పెంచుతుండటంతో ఆందోళన చెందుతున్నారు.

నేడు సమాశ్రయణం

కరీంనగర్‌కల్చరల్: పద్మనాయక కల్యాణ మండలంలో వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చిన జీయర్‌స్వామి సమాశ్రయణం నిర్వహిస్తున్నట్లు కమిటీ బాధ్యులు తెలిపారు.

చాలీసా, విష్ణు సహస్ర నామ పారాయణం

కరీంనగర్‌కల్చరల్: వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత గుడి ప్రక్కన గల ఆంజనేయస్వామి ఆలయంలో వాసవీ వాగ్దేవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా, విష్ణు సహస్ర నామ పారాయణాలు చేశారు. అర్చకుడు రామశర్మను సన్మానించారు. కోలాటం ఆడుతూ పాటలు పాడుతూ భక్తి ప్రపత్తులతో గడిపారు. అధ్యక్ష, కార్యదర్శులు మాడిశెట్టి ఉమ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.